# విశ్వక్రీడలకు భారత అథ్లెట్లు





## 4x400 రిలే జట్లకు పారిస్ ఒలింపిక్స్ బెర్తు

నసావు: భారత పురుషుల, మహిళల 4X400 రిలే జట్లు ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్ బెర్తును దక్కించుకున్నాయి. నసావు (బహమస్) వేదికగా జరుగుతున్న వరల్డ్ అథ్లెటిక్స్ రిలేస్‌లో భారత్‌కు రెండో స్థానం దక్కడంతో ఇరు జట్లకూ ఒలింపిక్స్ కోటా ఖరారైంది. మహిళల విభాగం రెండో రౌండ్ హీట్‌ను తెలుగమ్మాయి జ్యోతికా శ్రీదండి, రూపాలీ చౌదరీ, ఎంఆర్ పూవమ్మ, సుభా వెంకటేషన్.. 3 నిమిషాల 29.35 సెకన్లలోనే పూర్తిచేసి జమైకా (3:28.54) తర్వాత రెండో స్థానంలో నిలిచారు. మరోవైపు 4X400 రిలే రేసులో మహ్మద్ అనాస్, మహ్మద్ అజ్మల్, అరోకియా రాజీవ్, అమోజ్ జాకబ్‌తో కూడిన పురుషుల జట్టు 3 నిమిషాల 3.23 సెకన్ల వ్యవధిలో లక్ష్యాన్ని పూర్తి చేసింది. అమెరికా (2:59.95) అగ్రస్థానాన్ని దక్కించుకుంది.

# రైజర్స్‌కు సన్ స్ట్రోక్

**ఎస్‌ఆర్‌హెచ్ ప్లేఆఫ్స్ అవకాశాలు క్లిష్టం!**

**సూర్యకుమార్ సూపర్ సెంచరీ • హైదరాబాద్‌కు ముంబై షాక్**

**ఐపీఎల్–17 మొదటి అంకంలో భారీ స్కోర్లతో రెచ్చిపోయిన సన్‌రైజర్స్ హైదరాబాద్ రెండో దశలో మాత్రం నిరాశజనక ప్రదర్శనలతో తడబడుతోంది. ప్లేఆఫ్స్ రేసులో ప్రతీ మ్యాచ్ కీలకమైన నేపథ్యంలో ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో ఓడి నాకౌట్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. వాంఖడే వేదికగా ముంబైతో మ్యాచ్‌లో బ్యాట్‌తో విఫలమైన ఎస్‌ఆర్‌హెచ్.. బంతితోనూ తేలిపోయింది. లక్ష్య ఛేదనలో ముంబై విధ్వంసకవీరుడు సూర్యకుమార్ యాదవ్ సూపర్ సెంచరీతో ఆ జట్టు ఓదార్పు విజయాన్ని అందుకుంది.**

ముంబై: సన్‌రైజర్స్ హైదరాబాద్ మరోసారి చెత్తప్రదర్శనతో చేతులెత్తేసింది. ప్లేఆఫ్స్ రేసులో ఉన్న ఎస్‌ఆర్‌హెచ్.. వాంఖడే వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఓడింది. బంతితో హైదరాబాద్‌ను 173 పరుగులకే కట్టడిచేసిన ముంబై.. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్ (51 బంతుల్లో 102 నాటౌట్, 12 ఫోర్లు, 6 సిక్సర్లు) మెరుపు సెంచరీకి తోడు తిలక్ వర్మ (32 బంతుల్లో 37 నాటౌట్, 6 ఫోర్లు) రాణించడంతో 17.2 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. తొలుత హైదరాబాద్ 20 ఓవర్లలో 173/8 పరుగుల వద్దే ఆగిపోయింది. ట్రావిస్ హెడ్ (30 బంతుల్లో 48, 7 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ పాట్ కమిన్స్ (17 బంతుల్లో 35 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) హైదరాబాద్‌ను ఆదుకున్నారు. సూర్యకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

**హెడ్, కమిన్స్ ఇద్దరే..**

మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్‌కు హెడ్ దూకుడుతో శుభారంభమే దక్కింది. ఐదు ఓవర్లకే 50 పరుగుల మార్కును దాటిన ఎస్‌ఆర్‌హెచ్ తర్వాత గాడి తప్పింది. తన శైలికి భిన్నంగా నెమ్మదిగా ఆడిన అభిషేక్ శర్మ (11)ను బుమ్రా ఔట్ చేసి వికెట్ల పతనానికి శ్రీకారం చుట్టాడు. మిడిల్ ఓవర్స్‌లో ముంబై స్పిన్నర్ చావ్లా, సారథి హార్దిక్ పాండ్యా హైదరాబాద్‌ను దెబ్బకొట్టారు. అర్ధసెంచరీకి రెండు పరుగుల దూరంలో ఉండగా హెడ్‌ను చావ్లా ఔట్ చేయగా నితీశ్ (20)ను హార్దిక్ పెవిలియన్ చేర్చాడు. చావ్లా 13వ ఓవర్లో క్లాసెన్ (2) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. షాబాజ్ (10), జాన్సెన్ (17) నిరాశపరిచారు. ముంబై బౌలర్ల దూకుడుతో హైదరాబాద్ స్కోరు 150 పరుగులైనా చేస్తుందా..? అని అనిపించినా ఆఖర్లో కమిన్స్ రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో పోరాడగలిగే స్కోరు చేసింది.

**సూర్య–తిలక్ కేక**

లక్ష్య ఛేదనలో ముంబై కూడా తడబడింది. ఇషాన్ కిషన్ (9), రోహిత్ శర్మ (4), నమన్ ధీర్ (0) 4 ఓవర్లలోపే పెవిలియన్ చేరారు. కానీ సూర్య–తిలక్ ద్వయం ముంబైని లక్ష్యం దిశగా నడిపించింది. ఈ ఇద్దరూ ఎస్‌ఆర్‌హెచ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగడంతో లక్ష్యం కరుగుతూ వచ్చింది. ఈ జోడీని విడదీయడానికి కమిన్స్ బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. 30 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసిన సూర్య ఆ తర్వాత దూకుడు పెంచాడు. తిలక్ కూడా వీలుచిక్కినప్పుడల్లా బంతిని బౌండరీ లైన్ దాటించాడు. అర్ధ సెంచరీ తర్వాత 20 బంతుల్లోనే మిగిలిన 50 పరుగులను పూర్తిచేసిన సూర్య సెంచరీతో పాటు మ్యాచ్‌నూ ముగించాడు. నాలుగో వికెట్‌కు ఈ జోడీ అజేయంగా 143 పరుగులు జోడించింది.



సూర్యకుమార్ (102*)

### సంక్షిప్త స్కోర్లు

హైదరాబాద్: 173/8 (హెడ్ 48, కమిన్స్ 35 నాటౌట్, హార్దిక్ 3/31, చావ్లా 3/33). ముంబై: 17.2 ఓవర్లలో 174/3 (సూర్య 102 నాటౌట్, తిలక్ 37 నాటౌట్, భువీ 1/22, కమిన్స్ 1/35)

### పాయింట్ల పట్టిక

| జ | ఆ | గె | ఓ | ర | పా |
|---|---|---|---|---|---|
| కోల్‌కతా | 11 | 8 | 3 | 1.45 | 16 |
| రాజస్థాన్ | 10 | 8 | 2 | 0.62 | 16 |
| చెన్నై | 11 | 6 | 5 | 0.70 | 12 |
| హైదరాబాద్ | 11 | 6 | 5 | 0.06 | 12 |
| లక్నో | 11 | 6 | 5 | -0.37 | 12 |
| ఢిల్లీ | 11 | 5 | 6 | -0.44 | 10 |
| బెంగళూరు | 11 | 4 | 7 | -0.04 | 8 |
| పంజాబ్ | 10 | 4 | 6 | -0.06 | 8 |
| ముంబై | 12 | 4 | 8 | -0.21 | 8 |
| గుజరాత్ | 11 | 4 | 7 | -1.32 | 8 |

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

## శబ్దాలు ఆపేయండి..

**సచిన్ టెండూల్కర్‌పై ఫిర్యాదు**



ముంబై: భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ బాంద్రాలో కొత్తగా నిర్మిస్తున్న ఇంటి దగ్గర భారీ శబ్దాలు వస్తున్నాయంటూ దిలీప్ డిసౌజా అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. రాత్రి సమయంలో సిమెంట్ మిక్సింగ్ వాహనాలతో ఇబ్బంది అవుతుందంటూ తాను ఎదుర్కొంటున్న సమస్యను సచిన్‌ను ట్యాగ్ చేస్తూ డిసౌజా సోషల్‌మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ విషయంలో మీరు(సచిన్) కలుగజేసుకుని పరిష్కారించాలంటూ డిసౌజా ట్వీట్ చేశాడు. ఇది కొన్ని గంట ల వ్యవధిలోనే ఐదు లక్షల వ్యూస్‌కు తోడు 500 రీట్వీట్‌లు వచ్చాయి. క్రికెట్ ఐకాన్ పట్ల డిసౌజా వ్యవహరించిన తీరును సోషల్‌మీడియాలో చాలా మంది విమర్శిస్తూ ట్వీట్లు చేశారు. ఈ విషయంలో మీరు పోలీసులను సంప్రదించాల్సిందని ఒకరు అంటే...బీఎమ్‌సీ నిబంధనల ప్రకారమే నిర్మాణం జరుగుతుందని మరొకరు రాసుకొచ్చారు.

## 'వన్ జెర్సీ వన్ నేషన్'

- **టీ20 ప్రపంచకప్ భారత జెర్సీపై అభిమానుల్లో మిశ్రమ స్పందన**



ముంబై: వెస్టిండీస్, అమెరికా వేదికలుగా జూన్ 1 నుంచి జరుగనున్న ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్ టోర్నీకి భారత క్రికెట్ జట్టు కొత్త జెర్సీని విడుదల చేసింది. అధికారిక కిట్ స్పాన్సర్ అయిన అడిడాస్..ధర్మశాల స్టేడియం బ్యాక్‌డ్రాప్‌తో రోహిత్‌శర్మ, జడేజా, కుల్దీప్‌యాదవ్ కనిపిస్తున్న ఓ వీడియోను 'వన్ జెర్సీ వన్ నేషన్' స్లోగన్‌తో సోమవారం విడుదల చేసింది. నారింజ, నీలం రంగుల కలయికతో కూడిన జెర్సీకి వీ ఆకారంలో త్రివర్ణ రంగులతో రూపొందించారు. అయితే దీనిపై అభిమానుల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతున్నది. 2019 వన్డే ప్రపంచకప్ జెర్సీని పోలి ఉందని కొందరు అంటే బీజేపీ పార్టీ రంగుల్లో ఉందని కొందరు విమర్శలకు దిగారు.

# పొట్టి పోరుకు ఉగ్ర ముప్పు

**ట్రినిడాడ్ ప్రధాని వెల్లడి • భద్రత విషయంలో రాజీ లేదన్న ఐసీసీ**



పోర్ట్ ఆఫ్ స్పెయిన్: మరో నాలుగు వారాల్లో వెస్టిండీస్, అమెరికా సంయుక్త వేదికలుగా మొదలుకావాల్సి ఉన్న ఐసీసీ పురుషుల ప్రపంచకప్‌లో అలజడి సృష్టించేందుకు ఉగ్రమూకలు కుట్రపన్నినట్టు ట్రినిడాడ్ అండ్ టోబాగో ప్రధానమంత్రి కీత్ రౌలే వెల్లడించడం కలకలం రేపింది. సోమవారం ఆయన ఇదే విషయమై మాట్లాడుతూ.. '21వ శతాబ్దంలో ఉగ్రవాద ముప్పు పెరిగిపోవడం దురదృష్టకరం. భారీ టోర్నీలు జరిగేప్పుడు ఉగ్రమూకలు ముప్పు తలపెట్టే అవకాశం లేకపోలేదు. భద్రత విషయంలో మేం మరింత కట్టుదిట్టంగా వ్యవహరిస్తాం. టోర్నీలో ఆడే ప్రతి ఒక్క ఆటగాడికీ, మ్యాచ్‌లను వీక్షించేందుకు వచ్చే ప్రేక్షకుల భద్రతకు కట్టుబడి ఉన్నాం. ఇప్పటికే మా ఇంటిలిజెన్స్, ఇతర భద్రతా విభాగాలు ఆ దిశగా చర్యలు చేపట్టాయి' అని అన్నారు. పొట్టి ప్రపంచకప్ టోర్నీకి ఉగ్ర ముప్పు తలపెట్టదలచిన సంస్థ పేరును ఆయన నేరుగా ప్రకటించనప్పటికీ ఈ కుట్రల వెనుక 'ఇస్లామిక్ స్టేట్' హస్తమున్నట్టు వార్తలు వస్తున్నాయి. ట్రినిడాడ్ ప్రధాని ఈ ప్రకటన చేయగానే అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) స్పందించింది. ఈ వార్తలు వచ్చినప్పట్నుంచి ఆతిథ్య దేశాల ప్రతినిధులతో తాము ఎప్పటికప్పుడూ చర్చిస్తున్నామని, ఎలాంటి ప్రమాదాన్నైనా తట్టుకునే దిశగా చర్యలు చేపడుతున్నట్టు భరోసా కల్పించింది. వెస్టిండీస్ క్రికెట్ బోర్డు సైతం టోర్నీలో పాల్గొనబోయే ప్రతి ఒక్క ప్లేయర్ భద్రతకు హామీ ఇచ్చిందని తెలిపింది.



# ఐదు 'పసిడి' పంచ్‌లు

**ఏషియన్ యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్**

అస్తానా: ఏషియన్ అండర్–22 యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ బాక్సర్లు ప్రత్యర్థులపై పసిడి పంచ్‌లు విసురుతున్నారు. అస్తానా వేదికగా సోమవారం జరిగిన వేర్వేరు కేటగిరీలలో భారత బాక్సర్లు ఐదు స్వర్ణాలు గెలుచుకున్నారు. పురుషుల 48 కిలోల ఫైనల్‌లో బ్రిజేష్ 5–0 తేడాతో ముమినోవ్ (కిర్గిస్థాన్)ను మట్టికరిపించాడు. ఆర్యన్ (51 కిలోలు) 5–0తో కిర్గిస్థాన్‌కే చెందిన కమిలోవ్‌ను ఓడించి భారత ఆనందాన్ని డబుల్ చేశాడు. 63.5 కిలోల విభాగంలో యశ్వర్ధన్ 4–1తో తజకిస్థాన్ బాక్సర్ గపురోవ్ రుస్లన్‌ను చిత్తు చేశాడు. మహిళల 52 కిలోల కేటగిరీలో నిషా.. 5–0తో ఒటిన్‌బె(కజకిస్థాన్)ను మట్టికరిపించగా లక్ష్మీ (52 కిలోలు) రిఫరీ స్టాప్ ది కాంటెస్ట్ (ఆర్ఎస్‌సీ) నిర్ణయంతో నొముండరి (మంగోలియా)పై గెలిచి స్వర్ణం కైవసం చేసుకుంది.

## మలేషియా ఫుట్‌బాలర్‌పై యాసిడ్ దాడి



కౌలాలంపూర్: మలేషియా ఫుట్‌బాల్ జట్టు సభ్యుడు ఫైసల్ హలిమ్‌పై గుర్తుతెలియని ఆగంతకుడు యాసిడ్ దాడికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కౌలాలంపూర్‌కు అనుకుని ఉన్న పెటలింగ్ జయ జిల్లాలో ఆదివారం ఓ మాల్‌కు వచ్చిన ఫైసల్‌పై దుండగుడు యాసిడ్ పోసినట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో అతడి మెడ, భుజాలు, ఛాతి, చేతుల వద్ద చర్మం స్వల్పంగా కాలిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఫైజల్ ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

## వాణిజ్య



*మెదక్‌లోని ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలో క్లోజ్ రేంజ్ నావల్–91 గన్స్ తయారీకి సంబంధించిన ఒప్పంద పత్రాలను చూపుతున్న భారత కోస్ట్‌గార్డ్ డీఐజీ భిభూతి రంజన్, ఐఓఎఫ్ఎస్ జీఎం బాబ్జీ*

## డిజిటల్ గోల్డ్‌పై ఫోన్‌పే ఆఫర్లు

న్యూఢిల్లీ, మే 6: డిజిటల్ పేమెంట్ యాప్ ఫోన్‌పే.. అక్షయ తృతీయ దృష్ట్యా తమ యూజర్లకు స్పెషల్ క్యాష్‌బ్యాక్ ఆఫర్‌ను ప్రకటించింది. ఈ నెల 10న అక్షయ తృతీయ ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే 24 క్యారెట్ డిజిటల్ గోల్డ్ కొనుగోలుదారులకు రూ.2,000 వరకు తగ్గింపు ఆఫర్‌ను ఇచ్చింది. అయితే కనీసం రూ. 1,000 విలువైన కొనుగోళ్లకే ఆఫర్లు వర్తిస్తాయి. యూపీఐ, యూపీఐ లైట్, క్రెడిట్, డెబిట్ కార్డులు, గిఫ్ట్ కార్డుల పద్ధతుల్లో కూడా కొనుగోళ్లు చేసుకోవచ్చు. క్యారెట్‌లేన్ స్టోర్లలోనూ రాయితీలను అందిస్తున్నది.

## స్పందన స్ఫూర్తిలో సిగులర్‌కు 3.5% వాటా


ముంబై, మే 6: ప్రైవేట్ మార్కెట్స్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ సిగులర్ గుఫ్.. హైదరాబాద్‌కు చెందిన మైక్రోఫైనాన్స్ కంపెనీ స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్‌లో పెట్టుబడులు పెట్టింది. రూ.240 కోట్లతో దాదాపు 3.5 శాతం యాజమాన్య వాటాను సొంతం చేసుకున్నట్టు సోమవారం సిగులర్ కంపెనీ ప్రకటించింది. కాగా, బ్యాంకింగేతర ఆర్థిక కార్యకలాపాలను సాగిస్తున్న స్పందన స్ఫూర్తి సంస్థ నిర్వహణలోని ఆస్తులు ఈ ఏడాది మార్చి నాటికి రూ.11,970 కోట్లుగా ఉన్నాయి. ఇదిలావుంటే గతంలో దేశంలోని సిటీ యూనియన్ బ్యాంక్, మణప్పురం ఫైనాన్స్, రెప్కో హోం ఫైనాన్స్‌ల్లోనూ సిగులర్ పెట్టుబడులను పెట్టింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో 16 బిలియన్ డాలర్లకుపైగా ఆస్తులున్నాయి.

## భారతీయ ఎయిర్‌లైన్స్‌దే హవా

**అంతర్జాతీయ ప్రయాణీకుల రద్దీలో 2028కల్లా సగం మనదే**

ముంబై, మే 6: అంతర్జాతీయ విమాన ప్రయాణీకుల రద్దీలో 2027–28కల్లా సగం వాటా భారతీయ ఎయిర్‌లైన్స్‌దేనని క్రెడిట్ రేటింగ్స్ ఏజెన్సీ క్రిసిల్ సోమవారం అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరం (2023–24)లో 43 శాతంగా ఉందన్న క్రిసిల్.. 2028 మార్చి చివరి నాటికి దాదాపు 50 శాతానికి (700 బేసిస్ పాయింట్లు) చేరవచ్చన్నది. కొత్తగా వివిధ దేశాలకు విమాన సేవలను భారతీయ విమానయాన సంస్థలు విస్తరిస్తుండటం, ఇందుకు తగ్గట్టుగా పెద్ద ఎత్తున నూతన విమానాలను కొనుగోలు చేస్తుండటం కలిసొస్తున్నదని క్రిసిల్ చెప్పింది. 2023–24లో భారతీయ అంతర్జాతీయ ప్రయాణీకుల రద్దీ సుమారు 7 కోట్లను తాకింది. కరోనాతో ప్రభావితమైన 2020–21లో కోటిగానే ఉన్నది. దీంతో కరోనాకు ముందున్న డిమాండ్ నెలకొన్నట్టు క్రిసిల్ తెలియజేసింది.

# ఏఐ అల్లకల్లోలం



పెద్ద ఎత్తున ఊడిపోతున్న ఉద్యోగాలు • భారీగా లేఆఫ్‌లు ప్రకటిస్తున్న కంపెనీలు

ప్రపంచవ్యాప్తంగా నిపుణుల ఆందోళన • ముంచుకొస్తున్న సంక్షోభం ముప్పు

**పెరుగుట విరుగుట కొరకే అన్నట్టు.. మనిషి సాధిస్తున్న అద్భుతాలు చివరకు మానవాళి మనుగడకే ముప్పు తెచ్చిపెడుతున్నాయి.**

*కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఏఐ) ఇందుకో ప్రత్యక్ష ఉదాహరణ. అవును.. ఐటీ, టెక్నాలజీ ఇండస్ట్రీల్లో ఇప్పుడు ఏఐ దెబ్బకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఊడిపోతున్నాయి మరి.*

**ఇతర పరిశ్రమల్లోనూ ఏఐ ప్రకంపనలకు అవకాశాలు కనిపిస్తుండటం.. ప్రస్తుతం యావత్తు మానవ వనరులను భయపెడుతున్నది.**

న్యూఢిల్లీ/ముంబై, మే 6: సాంకేతికత హద్దులు దాటితే ఎంతటి అనర్థాలకు దారితీస్తుందో.. కృత్రిమ మేధస్సు (ఏఐ) పరిజ్ఞానం చాటి చెప్తున్నది. మనిషి సృష్టించిన విజ్ఞానం.. చివరకు ఆ మనుషుల పొట్టనే కొడుతున్నది మరి. మార్కెట్‌లో డిమాండ్ లేదని కొన్ని.. మా ఆదాయం పడిపోయిందని ఇంకొన్ని.. వ్యయ నియంత్రణ చర్యలు అంటూ మరి కొన్ని కంపెనీలు.. ప్రస్తుతం ఉద్యోగుల్ని తొలగించేస్తున్నాయి. కారణం ఏదైనా ఈ మొత్తం దుస్థితికి మూల కారణం మాత్రం ఒక్కటే.. అదే ఏఐ. నిజానికి అప్పుడెప్పుడో వచ్చిన కంప్యూటర్లతోనే జాబ్ మార్కెట్ రూపురేఖలు మారిపోయాయి. ఇప్పుడు ఏఐ దెబ్బకు మొత్తం తలకిందులవుతున్నది.

**ఇదీ సంగతి..**


సాధారణంగానే ఏ సంస్థ అయినా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పాదకతను కోరుకుంటుంది. దీనివల్ల మరింత లాభాలను అందుకోవచ్చు. ఈ క్రమంలో సేవలు, ఉత్పాదక రంగాల్లో యాంత్రిక విప్లవాన్ని కొత్త పుంతలు తొక్కిస్తూ వచ్చింది కృత్రిమ మేధస్సు. అయితే మానవ ప్రమేయాన్ని ఇది నామమాత్రం చేస్తుండటమే అసలు సమస్య. మానవ వనరులతో పోల్చితే ఏఐ ఆధారిత వనరుల ద్వారా కంపెనీలకు వ్యయం మితం, రాబడి అపరిమితం. ప్రధానంగా కృత్రిమ మేధస్సుతో పనిచేసే యంత్రాలు, రోబోల శ్రమ, పనివేళలకు పరిమితులేవీ ఉండవు. దీంతో ఈ పోటీ ప్రపంచంలో ఎక్కువ ఉత్పత్తిని సాధించవచ్చని కంపెనీలు భావిస్తున్నాయి. పైగా మనుషులతో వచ్చే ఎలాంటి జీతభత్యాల సమస్యలకూ ఆస్కారం ఉండదు. పనికి తగ్గట్టుగా యంత్రాలను వినియోగించుకోవచ్చు. అలాకాకుండా ఉద్యోగుల మీద ఆధారపడితే పని ఎక్కువైతే నియామకాలకు, తక్కువైతే తొలగింపులకు వెళ్లాల్సి వస్తుందని, ఈ వ్యవహారం కంపెనీలను ఎన్నో రకాలుగా ప్రభావితం చేస్తున్నదని మెజారిటీ సంస్థల యాజమాన్యాల మాట.

**రిస్క్‌లో 1.15 లక్షల ఉద్యోగాలు**

ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా ప్రపంచవ్యాప్తంగా ఆయా సంస్థలు ప్రకటించిన ఉద్యోగ కోతలు దాదాపు 1.15 లక్షలు. కేవలం జనవరి, ఏప్రిల్ నెలల్లోనే 80వేల ఉద్యోగుల్ని తీసేయబోతున్నట్టు కార్పొరేట్ కంపెనీలు స్పష్టం చేయడం గమనార్హం. ఇక ఈ జనవరి–మార్చిలో 200లకుపైగా కంపెనీల్లో 50,800 మంది కొలువుల్ని కోల్పోయినట్టు లేఆఫ్స్.ఫై గణాంకాలు చెప్తున్నాయి. కరోనా నేపథ్యంలో మొదలైన ఈ ఉద్యోగ కోతలు.. 2022లో తారాస్థాయికి చేరాయని 'ది చాలెంజర్ రిపోర్ట్' అంటున్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్దదిక్కుగా ఉన్న అమెరికాలో ఏఐ కారణంగా దాదాపు 10 శాతం ఉద్యోగులు రోడ్డున పడుతున్నారని ఓ ఆర్థిక నివేదిక అంటున్నది. కొత్త నియామకాలను దాదాపుగా నిలిపేస్తున్న కంపెనీలు.. ఉన్న ఉద్యోగుల్లోనూ ఏఐ నైపుణ్యం కలిగినవారికే ప్రాధాన్యాన్నిస్తున్నాయని బ్లూంబర్గ్ తాజాగా తెలియజేసింది.

### ఉద్యోగ కోతలకు టాప్-10 కారణాలు

- కృత్రిమ మేధస్సు
- ఆర్థిక మందగమనం
- ద్రవ్యోల్బణం
- అధిక వడ్డీరేట్లు
- మితిమీరిన నియామకాలు
- మదుపరుల ఒత్తిళ్లు
- కరోనా పరిణామాలు
- బ్యాంక్ సంక్షోభాలు
- మార్కెట్ పరిస్థితులు
- అంతర్జాతీయ ఉద్రిక్తతలు




## అమెరికాలో భారతీయ విద్యార్థులకు దొరకని ఇంటర్న్‌షిప్‌లు

**భవిష్యత్తుపై** ఎన్నో ఆశలతో అమెరికాకు వెళ్లిన భారతీయ విద్యార్థులకు నిరాశే ఎదురవుతున్నది. అగ్రరాజ్యంలో కనీసం ఇంటర్న్‌షిప్ ఆఫర్లూ దొరకడం లేదు. ఉన్నత విద్యను అభ్యసించి బడా కార్పొరేట్ కంపెనీల్లో కొలువులను పట్టాలంటే ఈ ఇంటర్న్‌షిప్ చాలాచాలా ముఖ్యం. కానీ ఆర్థిక మందగమనం ప్రభావంతో స్థానికులకే అక్కడి సంస్థలు అవకాశాల్ని ఇస్తున్నట్టు విద్యార్థులు, ఎడ్యుకేషన్ కన్సల్టెంట్లు, ఇండో–అమెరికన్ ప్రొఫెషనల్స్ చెప్తున్నారు. ఈ ఏడాదే అమెరికా అధ్యక్ష ఎన్నికలు కూడా ఉండటం.. పరిస్థితుల్ని ప్రభావితం చేస్తున్నట్టు వారు పేర్కొంటున్నారు. ఇక ద్రవ్యోల్బణం, అధిక జీవన వ్యయం, నిరుద్యోగం, స్పాన్సర్‌షిప్ సమస్యలు.. భారతీయ విద్యార్థులకు మరిన్ని కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. 'అమెరికా అత్యుత్తమ విద్యా సంస్థలైన ఎన్‌వైయూ స్టెర్న్, యూసీ బెర్క్‌లీ, బ్రౌన్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌ల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులకూ ఈసారి సమ్మర్‌లో ఇంటర్న్‌షిప్ ఆఫర్లు లేవు' అని ఎడ్యుకేషన్ కన్సల్టింగ్ కంపెనీ కాలేజీఫై సహవ్యవస్థాపకుడు ఆదర్శ్ ఖండేల్వాల్ అన్నారు. 'గత ఆరు నెలలుగా ఎన్నో కంపెనీల్లో దరఖాస్తు చేశాను. అయినా ఫలితం లేదు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ (స్టెమ్) విద్యార్థులకూ ఇబ్బందులు తప్పడం లేదు' అని హార్వర్డ్ యూనివర్సిటీలో ఎకనామిక్స్, సైకాలజీలను చదువుతున్న 22 ఏండ్ల ఫైనలియర్ గ్రాడ్యుయేట్ ఒకరు చెప్పారు. నిజానికి కరోనాకు ముందు స్టెమ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ల్లో భారీగా అవకాశాలుండేవని సదరు విద్యార్థి అన్నారు.

# రాష్ట్రంలో పెట్టుబడులకు బ్రేక్

*జాడలేని పాలసీలు, పారిశ్రామిక క్లస్టర్లు • మసకబారుతున్న తెలంగాణ ఖ్యాతి*

*ఇతర రాష్ర్టాల నుంచి పోటీ ఉన్నా పట్టనట్టు వ్యవహరిస్తున్న రేవంత్ సర్కారు*


హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): పెట్టుబడుల సాధనలో గత పదేండ్లు దేశానికే తలమానికంగా నిలిచిన తెలంగాణలో ఇప్పుడు పరిస్థితులు తారుమారయ్యాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కసారిగా బ్రేకులు వేసినట్టు కొత్త పెట్టుబడులు ఆగిపోవడంతోపాటు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఖరారైన పెట్టుబడులు సైతం క్రమంగా వెనక్కు మళ్లిపోతున్నాయి. ప్రభుత్వం అమలుచేసే విధానాల ఆధారంగానే పెట్టుబడులు వస్తాయి. వరంగల్‌లో పరిశ్రమను ఏర్పాటు చేసిన కిటెక్స్ కంపెనీయే అందుకు ప్రత్యక్ష ఉదాహరణ. మన రాష్ర్టానికి రావడానికి ముందు ఈ కంపెనీ ప్రతినిధులు 8 రాష్ర్టాల అధికారులు, ముఖ్యమంత్రులతో చర్చలు జరిపారు. ఆ కంపెనీని శ్రీలంక కూడా ఆహ్వానించింది. అయినప్పటికీ తెలంగాణ పారిశ్రామిక విధానాలు, నాటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పనితీరు తదితర అంశాల దృష్ట్యా వరంగల్ వైపే మొగ్గింది. నాటి ప్రభుత్వ కృషే ఇందుకు కారణం. ఇప్పుడు పరిశ్రమలను పట్టించుకునే నాథుడే లేడు.

**కాంగ్రెస్ సర్కారు ప్రతికూల నిర్ణయాలు**

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వచ్చిన వెంటనే ఫార్మా సిటీని రద్దు చేస్తున్నట్టు ప్రకటించి పారిశ్రామిక వర్గాలకు షాకిచ్చింది. దాదాపు అన్ని అనుమతులు వచ్చి.. పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న 16 వేల ఎకరాల ఫార్మాసిటీ స్థానంలో ఫార్మా విలేజ్‌లు తెస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఓఆర్ఆర్, ట్రిపుల్‌ఆర్ మధ్య పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేస్తామని, ఎంఎస్ఎంఈలకు కొత్త విధానాన్ని తెస్తామన్నారు. కానీ, 5 నెలలు కావస్తున్నా ఇంతవరకు వీటిపై ఎటువంటి స్పష్టమైన పాలసీని ప్రకటించలేదు. ఇప్పటికే ప్రముఖ గొరిల్లా గ్లాస్ తయారీ కంపెనీ కార్నింగ్ హైదరాబాద్ నుంచి మకాం మార్చింది. గత ఏడాది పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన ఈ కంపెనీ.. చెన్నైకి వెళ్లిపోయింది. ఇది రేవంత్ సర్కారుపట్ల పారిశ్రామిక వర్గాల్లో అపనమ్మకాన్ని చాటిచెప్తున్నది.

**పడకేసిన రియల్ ఎస్టేట్ రంగం**

ప్రస్తుతం రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కూడా పడకేసింది. కేంద్రంలో బీజేపీ సర్కారున్నా.. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించడంలో గత ప్రభుత్వం విజయవంతమైంది. పెట్టుబడిదారులకు సంపూర్ణ సహకారాన్ని అందించింది. ఇప్పుడు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారశైలి ఇందుకు భిన్నంగా ఉన్నది. దీంతో గతంలో పెట్టుబడులకు దేశంలోనే ప్రధాన గమ్యస్థానంగా ఉన్న తెలంగాణ ఖ్యాతి క్రమంగా మసకబారుతున్నది.



## 'ఐటీ అభివృద్ధిలో హైసియా భాగం కావాలి'

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 6 (నమస్తే తెలంగాణ): ఐటీ రంగం అభివృద్ధిలో హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) భాగస్వామ్యం కావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్ అన్నారు. ఇటీవలే కొత్తగా ఎన్నికైన హైసియా కార్యవర్గ సభ్యులతో టీ–హబ్‌లో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మౌలిక వసతులు, ప్రణాళికలపై ప్రభుత్వంతో చర్చించేందుకు ముందుకు రావాలని సూచించారు. సమావేశంలో హైసియా అధ్యక్షుడు ప్రశాంత్ నాదెండ్ల, ఉపాధ్యక్షుడు బిపిన్ పెండ్యాల, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఇక దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

న్యూఢిల్లీ, మే 6: ఈ ఏడాది ఆగస్టుకల్లా దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 4జీ టెలికం సేవలు అందుబాటులోకి రానున్నాయి. 'ఆత్మనిర్భర్'లో భాగంగా పూర్తిగా స్వదేశీ సాంకేతికతనే వినియోగించుకోనున్నదని అధికార వర్గాలు చెప్తున్నాయి. కాగా, జియో, ఎయిర్‌టెల్ ఇతర సంస్థలు ఇప్పటికే 4జీతో పాటు 5జీ సేవలను అందిస్తున్నది తెలిసిందే.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.